# అవకాశం

**ముందు జాగ్రత్త చర్యగా కర్ఫ్యూని మరోవారం రోజులపాటు పొడిగిస్తున్నామని ప్రకటించారు పోలీస్ కమీషనర్.**

మా గుండెల్లో రాయిపడింది. అమ్మాయికి నెలలు నిండుతున్నాయి. ఒకసారి చూసిపోదామని వియ్యాలవారొచ్చి మూడు రోజులైంది. వచ్చిన నాటి నుంచీ కర్ఫ్యూ మొదలైంది. రైళ్లు రద్దయ్యాయి. అసలే ఇంటి నిండా బోలేడు సామాను. దానికితోడు ముగ్గురు అతిథులు - అందులోనూ వియ్యాలవారు.

మేమున్న చోట మతోన్మాదాలూ, ఉద్రిక్త పరిస్థితులూ పాతబస్తీలో ఉన్నంతగా లేకపోయినప్పటికీ, కర్ఫ్యూ ప్రభావం సర్వాంతర్యామిలా వ్యాపించింది. ఇంట్లోంచి బయటికి పోవాలంటే భయం. ఇంట్లో ఉండాలంటే చిరాకు. పొద్దున్న లేచింది మొదలు బాధలు.

పొద్దున్నే పాలు దొరక్కపోవడమేకాదు బాధ. దొరుకుతున్నాయి, కానీ పాలపాకెట్లకి బ్లాక్ మార్కెట్. పాలతో బాటు ధరలు కూడా బాగా పిండుతున్నారు పాలవాళ్లు. కూరలకి బేరాల్లేవు. ఆటోలకి మీటర్లు లేవు.

"ఈళ్లకి కళ్లు మరీ నెత్తికెక్కిపోయాయి. అవకాశం దొరికింది కదా అని మరీ పేట్రేగిపోతున్నారు" అంటూ రంకెలు వేస్తున్నారు మా పక్కింటి వీరాస్వామిగారు. ఆటో అతను కిలోమీటరు దూరానికి పదిరూపాయలడిగాడు. వాళ్ల కిరాణా దుకాణానికి మామూలుగా రోజూ నడిచే వెళ్తూ ఉంటారు వీరాస్వామిగారు. కానీ, ఏదో సామాను తన కూడా తీసుకు వెళ్లాల్సి వచ్చింది. కూలివాణ్ణి రమ్మంటే అయిదు రూపాయిలడిగాడు. ఆ డబ్బుపెడితే ఆటోలోనే వెళ్లొచ్చును కదా అనుకుంటే, ఆటో అతను పదిరూపాయలడిగాడు. కర్ఫ్యూ కదా.

ఉత్తప్పుడే హాస్పిటల్‌కి వెళ్లాలనడం తడవు ఆటో అతను రేటు పెంచేస్తాడు. హాస్పిటల్‌కి వెళ్లే "అవసరం" మనదీ, "అవకాశం" అతనిదీనూ.

కర్ఫ్యూ సడలించిన సమయంలో కూరలు తెచ్చుకోవడానికి మార్కెట్‌కి వెళదాం రమ్మన్నారు వీరాస్వామిగారి భార్య మణెమ్మగారు. ఇళ్ల దగ్గర కొచ్చే కూరగాయల వాళ్ల

నాసిరకం కూరలు తెస్తూ ఉంటారు. ధరలు కూడా ఎక్కువే చెబుతారు. మార్కెట్‌లో అయితే అన్ని రకాల కూరలూ ఉంటాయి. తాజాగా ఉంటాయి. మణెమ్మగారు బేరాలు చెయడంలో నేర్పరి. అయితే, టొమాటోలు కిలో పదహారు రూపాయలు, బీరకాయలు పద్దెనిమిది రూపాయలు, ఉల్లిపాయలు ఇరవై రూపాయలు, అల్లం పావు పదిహేను రూపాయలు.. బేరమాడే అవకాశమే ఇవ్వలేదు కూరగాయల వాళ్ళు.

"గిష్టమయితే తీస్కపొండి, లేకుంటె లేదు, రేపటి సంది గియిగూడ దొర్కవ్" అని తెగేసి చెప్పారు. నేను వాడిగ్గా తీసుకునే చోట కూడా పైసా తగ్గదన్నాడు ఆ కూరగాయలతను.

"ఏమిటిది మరీ అన్యాయం" అన్నాను.

"మా పరేషాన్ మీకేంటి ఎరికైతది?" అన్నాడు.

కాసిని "ఆలుగడ్డలూ", టొమాటోలూ తీసుకుని కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి బయలుదేరాం. దారిపొడుగునా మణెమ్మగారు కూరగాయల వాళ్ళని దుమ్మెత్తిపోస్తూనే ఉంది.

"ఈళ్ల ఆశ మండిపోనూ! టొమాటాలు పదహార్రూపాయలంట, ఉల్లిగడ్డలు ఇరవై రూపాయలంట... దోచేస్తున్నారు ముష్టెదవలు" అంటూ.

"ఏం చేస్తాం? రోజులలా ఉన్నాయి. మనుషుల ప్రాణానికి నయాపైసంత విలువ లేకుండా పోతోంది. కూరగాయలకే విలువ మరి" అన్నాను.

నా మాటలు విని ఆవిడ నామీద కూడా విరుచుకు పడింది.

"అసలు మీరు మొదలుకాణ్ణించీ అంతే. మిమ్మల్ని అమాయకులనుకోవాలో ఏంటనుకోవాలో తెలీదు. మామూలుగా ఉత్తప్పుడే మీరు బేరమాడరు. ఆ కూరలోళ్లు ఎంత చెబితే అంతకి తీసేసుకుంటారు. ఆ ఎదవలు మోసంసేస్తున్నారని సెప్పినా యినిపించుకోరు మీరు" అంది సాధిస్తూ.

అవును, నాకు ప్రతి దానికీ బేరం చెయ్యాలంటే మొహమాటం. వాళ్లు చెప్పే ధరలు న్యాయమనిపించినా, అనిపించకపోయినా, ఆ కాసిని డబ్బుల కోసం ఎండనక, వాననక వాళ్ల పడే కష్టమూ, వాళ్లు కట్టే బట్టలూ, తినే తిండీ, ఉండే చోటూ తలుచుకుంటే కడుపులో కలిచినట్లవుతుంది. మనం ఎంతిస్తే వాళ్ల జీవితాలు మెరుగుపడతాయి? ఎప్పటికి మెరుగవుతాయి?

నేనూ "ఉన్నదాన్ని" కాకపోయినా, ఉన్నదాంతో బాగానే కాలక్షేపం అవుతోంది కదా. నాలుగు రోజులు కూరలకి ఇబ్బంది అయితే ఏమైంది! ఆ కూరల వాళ్ల జీవితాల్లో ఎన్ని ఇబ్బందులో? నా చేతుల్లో ఏముంది? ప్రభుత్వం నా చేతుల్లో లేదు కదా! నేను చెయ్యగలిగిందల్లా, వాళ్లు చెప్పిన ధరలకి కొనడమే. బేరమాడి, వాళ్లకి ఇంకా హీనస్థితి ఏర్పరచడం ఎందుకని

నేనెప్పుడూ సాధారణంగా బేరమాడను. ఈ విషయంలో మా ఇంట్లో నన్ను చివాట్లేస్తూ ఉంటారు నా "తెలివి తక్కువ తనా"నికి.

ఇరుగుపొరుగు వాళ్లు కూడా ఈ విషయంలో నాతో ఏకీభవించరు - కూరగాయలవాళ్లూ, అరటిపళ్లవాళ్లూ, చీపురుకట్టల వాళ్లూ, నీళ్లకుండలవాళ్లూ - ఇలాంటి వాళ్లతో నేను బేరాలాడ ననీ, నా మూలాన్ని వాళ్ల బేరాలు కూడా చెడుతున్నాయనీనూ.

నా "మెతకతనా"న్ని చూసి కూరగాయల అమ్మి, చీపుళ్ల అమ్మి కూడా నన్ను ఉబ్బేసి, బతిమాలి ఓ పాతరెవికో, పాత చెప్పుల జతో అడిగి పట్టుకుపోతుంటారు. మనకున్న వాటిల్లో ఎన్ని ఇస్తే వాళ్ల జీవితాలు మెరుగవుతాయి? ఎప్పుడు మెరుగవుతాయి? ఏమో, నాకు తోచినది ఇవ్వడం వరకే నేను చేయగలిగినది.

మణెమ్మగారి మాటలకి బదులు చెప్పలేదు నేను. ఇంటికి వెళ్లాక వంట ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను. వేరే కూరలేవీ తీసుకోలేదు. ఈ బంగాళాదుంపలతోనే సరిపెట్టుకోవాలి. టొమాటోలు వేసి పప్పు పులుసు చేస్తే సరిపోతుంది. కందిపప్పు ధర మండిపోతోంది. కిలో పద్దెనిమిదయింది. బియ్యం కనీసధర ఆరున్నర. వచ్చే రేషన్‌బియ్యం చాలవు, పైగా నోటపెట్టుకునేట్టు ఉండటంలేదు. వాటిలో సగం వడ్లూ, నూకలూ, రాళ్లూ, బెడ్డలూనూ. పాపం, వాటికోసమే ఎగబడుతుంది పనిమనిషి. దానికి అవి కొనుక్కోవడమే మహాభాగ్యం. కొన్నాళ్లు పోతే మాకూ అవే గతి అవుతాయి. ఇంక పనిమనిషి ఏంతిని బతుకుతుందో? నూనే కిలో నలభై అయిదు రూపాయిలు... భగవంతుడా, ఎలా ఈదడం ఈ సంసారాన్ని?

ఇంట్లో చుట్టాలు - వియ్యాలవారు. మధ్యాహ్నం పూట టిఫిన్ చెయ్యాలంటే భయం. బజ్జీలు చేద్దామంటే సెనగపిండి ఖరీదూ, నూనెఖరీదూ తలుచుకుంటే గుండె బిగపడుతుంది. ఇడ్లీలు చేద్దామంటే బియ్యం ఖరీదు, పచ్చడి చేద్దామంటే కొబ్బరికాయ ఖరీదు. ప్రతిదానికీ బేరీజు వేసుకోవడమే బతుకై పోయింది.

ఆఫీసులో అన్నికోతలూ పోగా ఆయన చేతికొచ్చే మూడువేలూ ఏమూలకి? ఇంటద్దెకే పోతుంది వెయ్యి. ఇక మిగిలిందాంట్లోనే ఎన్ని అవసరాలొచ్చినా గడుపుకోవాలి.

మా పెళ్లి నాటికి ఆయన జీతం మూడొందలు. అప్పుడదే గొప్ప. అయినా, అప్పుడూ, కటాకటిగ్గానే గడిచేది. ప్రతినెలా తండ్రికి కొంతపంపడానికీ, స్కూటర్‌కోసం చేసిన అప్పు తీర్చడానికీ, వచ్చేపోయే వాళ్ల మర్యాదలకీ, ఇంకా ఇతర ఖర్చులకీ సరిపోయేది. ఇక మిగిలేదీ, దాచుకునేదీ ఏ మాత్రం? ఇంక నాలుగైదేళ్లలో రిటైరవుతారు. ఇంతవరకూ ఒక కొంప ఏర్పాటు చేసుకోలేకపోయాం. పిల్లల చదువుల ఖర్చులూ, పెద్దవాళ్ల మందుల ఖర్చులూ, ఏదో ఒకటి సరిపోయింది - ఎంత చెట్టుకంతగాలి అన్నట్లు. పైగా క్రిందటేడు పిల్ల పెళ్లి ఖర్చొకటి -కట్నం తీసుకోలేదన్న పేరేగాని, ఖర్చు యాభైవేలకి పైనే అయింది.

అప్పుడు చేసిన అప్పు ఇంకా తీరుస్తూనే ఉన్నాం. ఇంక సొంతకొంప సమకూరేదెప్పుడు? మా ముందు రోజులు సజావుగా గడిచే ఏర్పాట్లు చేసుకునేదెప్పుడు?

ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. కరువులో అధికమాసం అన్నట్లు ఈ కర్ఫ్యూ ఒకటీ!

సాయంకాలం ప్రసాద్‌గారొచ్చారు మావారితో కలిసి కర్ఫ్యూ కబుర్లు చెప్పుకోవడానికి. ఆయన మా వీధి చివర్నే ఉంటారు. రెండు నిముషాల నడక వాళ్లింటి నుంచి మా ఇంటికి. ఆయనకి "ఆడియో, వీడియో కేసెట్లు" షాపొకటుంది పక్క బజారులో.

నేను టీచేసి పట్టుకెళ్లిచ్చాను ప్రసాద్‌గారికి. మావారూ, మా వియ్యంకుడూ అంతకు ముందే కాఫీ తీసుకున్నారు. టీ కప్పు ప్రసాద్‌గారికిచ్చి వెనక్కితిరిగి రాబోతూంటే -

"అమ్మా, మీ సలహా ఒకటికావాలండి'' అన్నాడాయన. నేను తెల్లబోయి, "నేనేం సలహా ఇవ్వగలనండీ మీకు?'' అన్నాను చిరునవ్వుతో.

"మీరే చెప్పాలమ్మా ఈ విషయం - చూడండి, కూరగాయల ధర విపరీతంగా పెంచేశారు కదా. మార్గం వెతకాలి కదండీ ఈ సమస్యకి'' అన్నాడాయన.

"ఏం చెయ్యగలమండీ? కొనగలిగితే కొనడం లేకపోతే తినడం మానెయ్యడం తప్ప?'' అన్నాను నీరసంగా.

"అట్లా చేతులు ముడుచుక్కూర్చుంటే ఎట్లాగండీ? నాకో ఆలోచన వచ్చిందండీ. మా మనుష్యుల్ని పెద్ద "మండీ'' కి పంపించి మన వీధిలో వాళ్లకి సరిపడ కూరలు నేను తెప్పిస్తానండి, మీరు ఈ వీధిలో ఉన్న ఇళ్ల వాళ్లంతా కొనేట్టు చూడాలండి. మనందరం కూడబలుక్కుని కొనుక్కుంటే ఈ కూరగాయల వాళ్ల దోపిడీని అరికట్టగలం కదండీ. నాకు లాభం అక్కర్లేదు, దారి ఖర్చులు గిట్టుబాటయితే చాలండి'' అన్నాడు.

నేను మావారికేసి చూశాను ఏమనాలో తెలియక. ఆయన ఉత్సాహంగా కుర్చీలో ముందుకి జరిగి, "అది బెస్ట్ అయిడియా, అది మనందరికీ లాభిస్తుంది. మీరు శ్రమ తీసుకుంటామంటే అంతకన్నా ఏం కావాలి'' అన్నారు. తమకెందుకనుకున్నారేమో, మా వియ్యంకుడు కలగజేసుకుని ఏమీ మాట్లాడలేదు.

ఏమీ లాభం లేకపోతే ప్రసాద్‌గారికేం పట్టింది అందరికీ చవగ్గా కూరలు తెప్పించి పెట్టేందుకు? ఆయన కేసెట్ల షాపుతో బాగా సంపాదిస్తున్నాడు. ఈ మధ్య కర్ఫ్యూ వచ్చాక, జనం బలవంతాన ఇళ్లల్లో కూర్చోవల్సిరావడంతో, వీడియో కేసెట్ల వ్యాపారం బాగా విజృంభించింది. కాస్త ఉన్న వాళ్లందరూ వీడియో కేసెట్లు వేసుకుని కాలక్షేపం చేస్తున్నారు.

అందరికీ ఈ వీడియో పిచ్చి పట్టుకుంటోంది. ఇక ప్రసాదగారిలాంటి వాళ్ల వ్యాపారానికేం కొదవ? మూడు పువ్వులూ ఆరుకాయలుగా ఉంటోంది.

అటువంటి ప్రసాద్‌గారు ఉత్తిపుణ్యానికి దారి ఖర్చులు పెట్టుకుని చవగ్గా అందరికీ కూరగాయలు తెప్పించి అమ్ముతాననంటే నాకు నమ్మబుద్ధికాలేదు. ఆ కూరగాయలవాళ్లు కొట్టే "లాభాల్ని"వాళ్లని కొట్టనివ్వకుండా, వాళ్ల "దోపిడీ"ని అరికట్టాలని ఆయన ఆకాంక్ష!

ఏరాయి అయితేనేం పళ్లూడగొట్టించుకోవడానికి? దోపిడీ ఎవరు చేసినా, ఆ దోపిడీకి గురి అయేది మేమేగా. పాపం, ఆ బీదవాళ్ల నోరుకొట్టి తమ జేబులు నింపుకుందామని ఉన్నవాళ్ల ఆశ! కాస్త అవకాశం వచ్చినా "సద్వినియోగం" చేసుకునే వ్యాపార దృష్టి ఉన్న వాళ్లకి కరువుకాటకాలూ యుద్ధాలూ మంచి "అవకాశాలు". "కర్ఫ్యూ" చీటికీమాటికీ వస్తుందా?

నా మనసులో ఆలోచనలు ఎలా ఉన్నా, పైకి మాత్రం, "అలాగే తెప్పించండి, అంతకన్నా ఏం కావాలి?" అన్నాను - మావారి మాటల్ని సమర్థిస్తూ.

కానీ, ఆ "అయిడియా" అమలు కాలేదు. ప్రసాద్‌గారికింకోపని పడిందిట. అంటే, ఇంతకన్నా లాభం వచ్చే వ్యాపారం ఏదో చేపట్టి ఉంటాడాయన.

"ముందు జాగ్రత్త చర్య" గా కర్ఫ్యూ ఇంకా కొనసాగుతోంది - రెండు రోజులు, మూడు రోజులు చొప్పున. కొన్ని బస్తీల్లో కల్లోల పరిస్థితులు మరింత విషమిస్తున్నాయి. మరి కొన్నిచోట్ల ఉద్రిక్తత అధికమవుతోంది. తీవ్రమైన గాయాలతో, ప్రమాదకరపరిస్థితుల్లో ఆసుపత్రుల్లో చేర్చబడేవారి సంఖ్య ఎక్కువవుతోంది. ఇళ్లూ వాకిళ్లూ పోగొట్టుకుని నిరాశ్రయులై, ఇతర "సురక్షిత" ప్రదేశాలకు తరలి వస్తున్నారు జనం.

మా ఇల్లుగలాయన వచ్చి అద్దె వంద రూపాయలు పెంచమన్నాడు. మేము నిర్ఘాంతపోయాం. అద్దెపెంచి ఆరునెలలు కాలేదు. మళ్లీ ఒక్కసారిగా అంత అద్దె పెంచమనడం ఏమిటి?

"పాతబస్తీలో ఉన్న మా దుకాణం దోచుకుపోయారు. మాకు బాగా నష్టం వచ్చింది. మీరు అద్దె పెంచితేగాని మాకు జరగదు. మీకు కష్టమైతే మరో ఇల్లు చూసుకోండి" అని చెప్పేశారు నిష్కర్షగా. ఆయన చెప్పింది నిజమవునోకాదోగాని, ఆయన మేమిచ్చే అద్దెతోనే బతకడం లేదన్నది మాత్రం నిజం. వేరే బస్తీల్లో కూడా ఇళ్ళున్నాయి ఆయనకి.

ఇన్నాళ్ల నుంచీ ఏ ఇబ్బందీ కలిగించకుండా ఉంటూ, అడిగినప్పుడల్లా మర్యాదగా అద్దెపెంచి ఇస్తున్నామని కించిత్తు గౌరవం చూపించలేదు.

అసలే ఇంట్లో బంధువులున్నారు. ఇప్పటికిప్పుడు ఇల్లు మారడంగాని, ఇంకో ఇల్లు ఈ మాత్రంగా దొరకడంగాని ఎంతకష్టం! ఏం చేస్తాం? కర్ఫ్యూ! నోరెత్తకుండా అద్దెపెంచాం. అది మళ్లీ తగ్గదని తెలుసు.

బ్యాంకులో దాచుకున్న కాస్త మొత్తం మంచులా కరిగిపోతోంది. దినదిన ప్రవర్థమాన మవుతున్న ఖర్చులవేడికి. అమ్మాయి పురిటి ఖర్చొకటుంది ఇంకా.

నూతన ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకే కల్లోల పరిస్థితులు చల్లబడ్డాయి. ఉద్రిక్తత సడలింది క్రమంగా. రైళ్లు యథా ప్రకారం నడుస్తున్నాయి. బంధువులు వెళ్లిపోయారు. "సాధారణ పరిస్థితులు" నెలకొన్నాయి. కాస్త తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటున్నాం.

కానీ, కర్ఫ్యూ అనంతరం నెలకొన్న సాధారణ పరిస్థితుల్లోనే కొన్ని మార్పులు కొట్టొచ్చినట్లు కనిపించాయి. మా పక్కింటి వీరాస్వామిగారి కిరాణాకొట్టు మొన్ననే "సూపర్ మార్కెట్" గా మారింది. ప్రసాద్‌గారి వీడియోకేసెట్ల దుకాణానికి జంటగా ఫోటో స్టూడియో వెలిసింది. పెళ్లిళ్లకీ వాటికీ వీడియోలు తీయడం వారి ప్రత్యేకత అని బోర్డ్‌పెట్టారు. మా ఇల్లుగలాయన కొత్తమోడల్ మారుతీకారు కొన్నాడు.

కూరగాయల వాళ్లు కూరగాయల ధరలు కొంత తగ్గించారు. అయితే, మేము వాడిగ్గాకొనే చోట కూరగాయల వాడి బండి లేదు. నేలమీద గోనె పరచుకుని, దానిమీద పెట్టుకున్నాడు కూరగాయలన్నీ. అతనిపెళ్లాం ఓ పక్కగా కూర్చుని పిల్లాడికి పాలిస్తోంది.

"నీ బండి ఏమైంది? నేలమీద పెట్టుకున్నావేం? ఈపాటికి పెద్ద కూరగాయల దుకాణం పెడతావనుకున్నాను!" అన్నాను - కర్ఫ్యూరోజుల్లో వాళ్ల "దోపిడీ" మనసులో మెదిలి.

"మా బత్కులికి దుకనం గూడనా అమ్మా? మొన్న కొట్లాటల్ల నా బండినెవురో ఇరిసి ముక్కలు సేసిన్రు. మల్ల సేపిచ్చుకుంటానికి నా తాన పైసల్లేవు. తిండికే సాల్తంలేదు, ఇగ దుకనం గుడనా మా గరీబోల్లకు" అని కళ్లు తుడుచుకున్నాడు.

"కూరగాయలు దినాం మాతానే తీస్కో దొరసాని" అంది కూరగాయలవాడి పెళ్లాం.

"అలాగేలే" అని, ఏవో కూరలు తీసుకున్నాను. కూరగాయల ధరలు కొంత తగ్గాయి. కానీ, కూరగాయల వాళ్లు ఎప్పటిలాగే ఉన్నారు.

కూరలమ్మేవాణ్ణి చూస్తే కలిగిన జాలితో బాటు, మా పరిస్థితి చూసుకుని జాలిపడాలో చిరాకు పడాలో తెలియలేదు - వాడిలా బండి మీంచి నేలమీదికి చటుక్కున దిగనూలేము, అటు పైస్థాయికి ఎగదోసుకుపోనూలేము. మధ్యస్థంగా ఒక మిధ్యాసంస్కారంతో "పరువు'"గా బతకాలనుకుంటూ, బతుకు బరువుగా ఉందని కుంగిపోతూ వాపోతూ ఉంటాం.

"భూమ్యాకర్షణ శక్తి" సూత్రాన్ని న్యూటన్ కనిపెట్టాడు.

అయితే పైవాళ్లు ఇంకా పైకి పోవడం, క్రిందివాళ్లు ఇంకా క్రిందికి దిగజారిపోవడం, మధ్యవాళ్లు మధ్యలో ఇరుక్కుపోవడం - ఈ సూత్రాన్ని ఏమంటారో! దీనికి విరుగుడు ఎవరు కనిపెడతారో?.

**వార్తాకాలం, మే 16-31, 1991**